సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు




గురువారం 16 జూలై 2026 | ● పేజీలు : 08 | ● వెల: 2/- | ● సంపుటి: 2 . సంచిక : 44 | ● ప్రచురణ : సూర్యాపేట | ● ఎడిటర్: శెట్టి వెంకటేష్




## రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో జనసేన చర్చా వేదిక

కైకలూరు, సందేశం టైమ్స్, రిపోర్టర్ శెట్టి వెంకటేష్ (16-07-2026): కూటమిగా కలిసి పనిచేస్తున్నప్పుడు చిన్నచిన్న భేదాభిప్రాయాలు రావడం సహజమేనని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ గారు అన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే, వాటిని వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన సూచనల మేరకు రాబోయే రోజుల్లో జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఎటువంటి మనస్పర్థలు లేకుండా, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. బుధవారం కైకలూరు నియోజక వర్గంలో జనసేన చర్చ వేదిక కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న పార్టీ కార్యకర్తల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలుసుకునేందుకు జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఒక వినూత్న ఆలోచనతో 'జనసేన చర్చా వేదిక' కార్యక్రమానికి రూపకల్పన చేశారని వివరించారు. ఈ వేదిక ద్వారా కార్యకర్తలతో నేరుగా ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామాలు, మండల స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు, క్షేత్రస్థాయి సవాళ్లపై కార్యకర్తల నుంచి నేరుగా అభిప్రాయాలు, విలువైన సూచనలు సేకరించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, తద్వారా పార్టీని ప్రజల్లోకి మరింత పటిష్టంగా తీసుకెళ్లవచ్చని అన్నారు. ఈ చర్చా వేదికలో భాగంగా సేకరించిన అభిప్రాయాల్లో కైకలూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీటితోపాటు రైతాంగానికి, ఆక్వా రైతులకు ప్రభుత్వం నుంచి మరింత సహాయం అందించాలని కార్యకర్తలు కోరారని పేర్కొన్నారు. కార్యకర్తలు లేవనెత్తిన అన్ని సమస్యలపై అధికారుల నుంచి తక్షణమే నివేదికలు తెప్పించుకుంటామని, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఈ సమస్యలన్నింటికీ త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మంచినీటి సమస్యను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ద్వారా ప్రణాళికాబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. ఈ 'జనసేన చర్చా వేదిక' కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ నిర్వహిస్తామని తెలిపారు. ముంబయిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని, మరో రెండు మూడు రోజుల్లో ఆయన మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని, పార్టీ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తారని వెల్లడించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు పూర్తిగా నాశనమయ్యాయని, కుప్పకూలిన ఆ వ్యవస్థలను తిరిగి నిలబెట్టడం, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడం కేవలం శ్రీ నారా చంద్రబాబు నాయుడు, శ్రీ పవన్ కళ్యాణ్ గారి సంయుక్త నాయకత్వంలోనే సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్ శ్రీ పిడుగు హరి ప్రసాద్, శాసన సభ విప్ శ్రీ బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్సీ శ్రీ జయమంగళ వెంకటరమణ, శాసనసభ్యులు శ్రీ పత్సమట్ల ధర్మరాజు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ కళ్యాణం శివ శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ కొటికలపూడి గోవిందరావు, కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ బండ్రెడ్డి రామకృష్ణ, పార్టీ నాయకులు శ్రీ చెన్నమల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే రేపటి తెలంగాణ పునర్నిర్మాణ కర్తలు: సీఎం రేవంత్ రెడ్డి

కొత్తకోట, సందేశం టైమ్స్, రిపోర్టర్ శెట్టి వెంకటేష్ (16-07-2026): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర పోషించాలని, పలుగు, పార పట్టిన చేతులే కలాలు పట్టి తెలంగాణ రాత మార్చాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, జూపల్లి కృష్ణారావు గారు, వాకిటి శ్రీహరి గారు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి గారితో కలిసి ప్రారంభోత్సవం చేసిన ఆయన, అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, చదువొక్కటే భవిష్యత్తును నిర్ణయించి, జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంచుతుందని ఉద్బోధించారు. రూ. 1000 కోట్లకుపైగా ఖర్చుతో ఆగస్టు 15వ తేదీ లోపు రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు 9 రకాల వస్తువులతో కూడిన 'తెలంగాణ ఎడ్యుకేషన్ కిట్లను' అందించబోతున్నామని, ఈ కిట్లలో వచ్చిన వస్తువుల నాణ్యతపై విద్యార్థులు వాట్సాప్ వేదికగా ఫీడ్‌బ్యాక్ ఇచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోందని వెల్లడించారు. గతంలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని, వాటిని బలోపేతం చేయకుండా వందేళ్లయినా సమస్య పరిష్కారం కాదనే ఉద్దేశంతోనే తాము కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వీటిని తీర్చిదిద్దాలని శపథం పూని పనిచేస్తున్నామన్నారు. ఒకటి రెండేళ్లలోనే మొత్తం వ్యవస్థ బాగుపడకపోయినా, ప్రజాప్రభుత్వం రాగానే ఉపాధ్యాయులకు 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, పదేళ్లుగా జరగని బదిలీలను చేపట్టామని, 317 జీవోను అమలు చేసి చెదిరిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలను ఒకచోటుకు చేర్చామని గుర్తుచేశారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి వల్లే కేంద్ర విద్యా శాఖ ప్రకటించిన పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 36వ స్థానం నుంచి 18వ స్థానానికి ఎదిగిందని, మొదటి రెండు స్థానాలు సాధించే వరకు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున అవార్డులు ఇస్తామని, ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావిధానాల అధ్యయనం కోసం ఈ ఏడాది 50 మంది టీచర్లను విదేశాలకు పంపగా, వచ్చే ఏడాది మరో 150 మందిని పంపిస్తామని చెప్పారు. ఏఐ విప్లవం వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్నందున యువతకు జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషలను నేర్పించి, స్కిల్స్ పెంచడం ద్వారా బ్లూ కాలర్ ఉద్యోగాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చే పిల్లలే రేపు డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులుగా రాణించాలని, చదువులో వెనుకబడిన వారు క్రీడల్లో ప్రతిభ చాటాలని కోరారు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ. 1.08 లక్షలు ఖర్చు పెడుతున్నందున ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని తమను తాము నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.




## 2034 లక్ష్యాల దిశగా తెలంగాణ ప్రయాణం ప్రారంభం: సీఎం రేవంత్ రెడ్డి

భారత్ ఫ్యూచర్ సిటీ, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): 2034 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా తెలంగాణ ప్రయాణం ప్రారంభమైందని, ప్రపంచంలోనే ఒక అద్భుతమైన నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్న సంకల్పానికి అమెజాన్ నెలకొల్పుతున్న డేటా సెంటర్ తొలి మెట్టుగా నిలుస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్న దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి శంకుస్థాపన చేసిన ఆయన, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. దేశంలోనే అభివృద్ధి చెందిన మోడల్ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడంలో అమెజాన్ భాగస్వామిగా నిలిచి, 2034 నాటికి రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని ఆకాంక్షించారు. 108 దేశాల ప్రతినిధులు, 3 వేలకు పైగా కార్పొరేట్ దిగ్గజాలతో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలనే లక్ష్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మరియు అంతర్జాతీయ నిపుణుల సహకారంతో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్'ను రూపొందించినట్లు తెలిపారు. దేశంలో కేవలం 2.5 శాతం జనాభా ఉన్న తెలంగాణ, ప్రస్తుతం దేశ జీడీపీకి 5 శాతం తోడ్పాటునందిస్తోందని, దీనిని 2047 నాటికి 10 శాతానికి పెంచేందుకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సింగిల్ విండో పద్ధతిలో వేగంగా అనుమతులు ఇస్తున్నామని, 2025 డిసెంబర్ పాలసీ ప్రకారం అమెజాన్‌కు భూమి కేటాయించి ప్రభుత్వం చెప్పింది చేస్తుందని నిరూపించామని గుర్తుచేశారు. రాబోయే 14 ఏళ్లలో అమెజాన్ సంస్థ పెట్టబోయే 7 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, పెట్టుబడుల ప్రగతిపై ప్రతి నెలా తానే స్వయంగా సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. పారిశ్రామిక వృద్ధి కోసం టూరిజం, మెడికల్, స్పోర్ట్స్ రంగాలలో స్పష్టమైన పాలసీలు తెచ్చామని, రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఓఆర్‌ఆర్ లోపలి భాగాన్ని కాలుష్య రహిత హైదరాబాద్‌గా మార్చేందుకు కాలుష్య కారక పరిశ్రమలను తరలిస్తున్నామని, మూసీ నది ప్రక్షాళనతో పాటు ఈవీ వాహనాలను ప్రోత్సహించడానికి ఏటా రూ. 1500 కోట్ల ఆదాయాన్ని కోల్పోతూ జీరో టాక్స్ అమలు చేస్తున్నామని వివరించారు. ఓఆర్‌ఆర్ అవతలి ప్రాంతం నుండి రీజినల్ రింగ్ రోడ్డు లోపలి వరకు మాన్యుఫాక్చరింగ్ జోన్‌గా, ట్రిపుల్ ఆర్ వెలుపలి భాగాన్ని రూరల్ అగ్రికల్చర్ ఎకానమీగా అభివృద్ధి చేస్తామని, ఈ ప్రయాణంలో భూములిచ్చిన రైతుల త్యాగాలను స్మరిస్తూ వారికి నష్టపరిహారాన్ని పెంచి భరోసా కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, అమెజాన్ ప్రతినిధులు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుపై త్వరలోనే శుభవార్త: సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, సందేశం టైమ్స్, రిపోర్టర్ శెట్టి వెంకటేష్ (16-07-2026): పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి తొందర్లోనే శుభవార్త వినబోతున్నామని, ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఒప్పించి అనుమతులు సాధించే దిశగా ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో నూతనంగా స్థాపించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (CQP) తయారీ యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న డిండి, పాలమూరు – రంగారెడ్డి, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి, సమస్యల పరిష్కారానికి పక్క రాష్ట్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని, డిండి ప్రాజెక్టుకు సంబంధించి 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులకు సంపూర్ణ అనుమతులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యతను తానే తీసుకుంటానని, పాలమూరు జిల్లా వాడిగా అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. జిల్లాలో విద్యా, పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రతి నియోజకవర్గానికి ఏటీసీలు తీసుకువచ్చామన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము తీసుకొచ్చిన నూతన టూరిజం, ఎనర్జీ, మెడికల్, స్పోర్ట్స్ పాలసీలకు మరియు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు అమర రాజా సంస్థ మద్దతుగా నిలవాలని కోరారు. పరిశ్రమల కోసం భూములిచ్చిన స్థానిక రైతులను గౌరవిస్తూ ఇక్కడి నిరుద్యోగ యువతకే అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అమర రాజా యాజమాన్యానికి సూచించారు. శరవేగంగా మారుతున్న వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలంటే ఈవీ వాహనాల వినియోగం పెరగాలని, అందువల్ల ఈవీ బ్యాటరీల ప్రాధాన్యతను గుర్తించి 32 గిగావాట్ సామర్థ్యం కలిగిన అమర రాజా ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సంస్థలో పనిచేసే 700 మంది ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం గర్వకారణమని ప్రశంసించారు. చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలతో పోటీ పడుతూ స్థానిక టాలెంట్‌తో గ్లోబల్ స్థాయిలో రాణిస్తున్న అమర రాజా గ్రూప్ ఛైర్మన్ గల్లా జయదేవ్ ఆధ్వర్యంలోని యాజమాన్యాన్ని అభినందిస్తూ, వారికి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ డీకే అరుణ, ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక

# అర్హులైన ప్రతి ఓటరూ ఓటరు జాబితాలో ఉండాలి సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు తాము పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ), బీఎల్ఓ సూపర్‌వైజర్ లేదా సమీప హెల్ప్‌డెస్క్‌లో అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్లకు మరింత సౌలభ్యం కల్పించేందుకు జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని, వాటి వివరాలను మరియు బాధ్యుల ఫోన్ నంబర్లను ప్రజల కోసమే విడుదల చేశామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి హెల్ప్‌డెస్క్‌గా సంగారెడ్డి కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఓ కార్యాలయ ఆపరేటర్ జి. ప్రశాంత్ (8106046979) అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే నియోజకవర్గాల వారీగా... నారాయణఖేడ్ నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ ఆఫీస్ సీవో వి. ప్రవీణ్ (9494168579), తహసీల్దార్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్లు ఎం. శ్రీకాంత్ (9381588201), ఎం. సుధాకర్ (9177324845), మున్సిపల్ వార్డు ఆఫీసర్ కృష్ణ (9652132943), కంగ్టి తహసీల్దార్ ఆఫీస్ సీవో కె. సంజీవ్ (9959990003), కల్హేర్ జీపీఓ లక్ష్మణ్ (9581082080), మనూర్ సీవో జి. విఠల్ రెడ్డి (9398484128), నాగల్‌గిద్ద రెవెన్యూ అసిస్టెంట్ ఇ. సునీత (7671832733), నిజాంపేట్ గిర్దావర్ మనోహర్ (8096661403), సిర్గాపూర్ ఎఫ్‌టీఎస్ రామకృష్ణ (7660918609), శంకరంపేట్ (ఎ) జూనియర్ అసిస్టెంట్ వీరమణి (9553332868)లను సంప్రదించవచ్చన్నారు. ఆందోల్ (ఎస్సీ) నియోజకవర్గానికి ఆర్డీఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ ఎం. మహిపాల్ (9177363464), అల్లాదుర్గం జూనియర్ అసిస్టెంట్ పి. సాయిలు (8121238427), ఆందోల్ ఆపరేటర్ వినయ్ (6300335220), చౌటకూర్ జీపీఓ సత్యనారాయణ (9912367393), మునిపల్లి ఆపరేటర్ చందు (9948434188), పుల్కల్ రికార్డు అసిస్టెంట్ జి. వంశీకృష్ణ (9550365624), రాయికోడ్ ఆపరేటర్ సుధాకర్ (9441851322), రేగోడ్ జీపీఓ రాములు (9676184247), టేక్మాల్ జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ తేజ (9492093208), వట్‌పల్లి ఆపరేటర్ ఆనంద్ (9014930161), ఆందోల్ ఎంపీడీఓ ఆఫీస్ ఆపరేటర్ రవిశంకర్ (9493978145), ఆందోల్-జోగిపేట్ మున్సిపల్ ఆపరేటర్ లక్ష్మీనారాయణ (9492651600)లను నియమించామన్నారు. జహీరాబాద్ (ఎస్సీ) నియోజకవర్గంలో ఆర్డీఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ అనిత (7995034779), తహసీల్దార్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ విజయమ్మ (9959229159), మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ మైతాబ్ (9010209162), న్యాల్‌కల్ రికార్డు అసిస్టెంట్ రాజేందర్ (6303529975), కోహిర్ జూనియర్ అసిస్టెంట్ మాన్ సింగ్ (8074834183), ఝరాసంగం జూనియర్ అసిస్టెంట్ ఐజాజ్ (9959898706), మొగుడంపల్లి జూనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి (9848169844)లను సంప్రదించాలన్నారు. సంగారెడ్డి నియోజకవర్గానికి ఆర్డీఓ ఆఫీస్ మల్లేశం (ఎపిక్ విభాగం - 9908193082), తహసీల్దార్ ఆఫీస్ జె. జ్యోతి (9908083032), కంది సీనియర్ అసిస్టెంట్ రామాదేవి (9000516253), కొండాపూర్ సి. రమేష్ (9985442495), సదాశివపేట తహసీల్దార్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ అనంతయ్య (ఎపిక్ విభాగం - 9666685757), మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ సరిత (7396744800), సంగారెడ్డి మున్సిపల్ ఆఫీస్ భవాని (8790783438), శివానంద స్వామి (9491228388), స్వాతి సీనియర్ అసిస్టెంట్ (7702797454), ఎంపీడీఓ ఆఫీస్ జగన్ (9110588069)లు అందుబాటులో ఉంటారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి తహసీల్దార్ ఆఫీస్ టి. శ్రీనివాస్ (9010849975), అమీన్‌పూర్ అమరేందర్ రెడ్డి (08455-295005), రామచంద్రాపురం జూనియర్ అసిస్టెంట్ దశరథ్ (9949644171), గుమ్మడిదల జూనియర్ అసిస్టెంట్ శివశంకర్ (9052299687), జిన్నారం మహ్మద్ మౌలాలి (9000213155), అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫీస్ (సీఎంసీ) గోపాల్ (9440954722), పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ ఆఫీస్ (సీఎంసీ) నవోద్ రెడ్డి (9948727432), ఇస్నాపూర్ మున్సిపాలిటీ డి. శ్రీనివాస్ (9866485654), ఇంద్రేశం కవిత (9000934461), గడ్డపోతారం నవీన్ (9642687472), గుమ్మడిదల సాయి (8143656334), ఎంపీడీఓ ఆఫీస్ వెంకటేశం (9908299986)లను సంప్రదించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు. ఓటర్లందరూ తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలను అన్ని వివరాలతో పూరించి, సంబంధిత అధికారులకు నిర్ణీత గడువులోగా అందజేసి ఈ ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.




# హైదరాబాద్‌లో వైభవంగా బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సదస్సు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత - 2026 ఆధ్వర్యంలో 12వ బ్రిక్స్ కార్మిక మరియు ఉపాధి మంత్రుల సమావేశం ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాల కార్మిక మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొని కీలక అంశాలపై చర్చలు జరుపుతున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే కూడా హాజరయ్యారు. ఈ సదస్సులో భారతదేశ అధ్యక్షతన ప్రధానంగా నాలుగు ప్రాధాన్యత అంశాలపై చర్చలు కేంద్రీకృతమయ్యాయి. అందులో భాగంగా సామాజిక భద్రతను పెంపొందించడం, కార్మిక మార్కెట్ల క్రమబద్ధీకరణ, ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడం మరియు వారి చేరికను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాల మ్యాపింగ్ మరియు అభివృద్ధి రంగాల్లో పరస్పర సహకారం అందించుకోవడం, అలాగే గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికులతో సహా శ్రామికులందరికీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి ముఖ్యమైన అంశాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చిస్తున్నారు.

# సంగారెడ్డిలో జూలై 18న మెగా జాబ్ మేళా: జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సంగారెడ్డిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థలైన స్వతంత్ర మైక్రో ఫిన్ లిమిటెడ్ మరియు క్వెస్ కార్పొరేషన్ లిమిటెడ్ పాల్గొని అర్హులైన అభ్యర్థులకు నేరుగా ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళా ద్వారా భర్తీ చేయనున్న ఖాళీల వివరాలను వెల్లడిస్తూ... 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి, పదవ తరగతి (ఎస్ఎస్‌సీ) మరియు అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్న వారి కోసం నెలకు 15,000 రూపాయల నుండి 20,000 రూపాయల వరకు జీతంతో 20 ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ అర్హతతో, 18 నుండి 35 సంవత్సరాల వయస్సు ఉండి, నెలకు 23,000 రూపాయల జీతంతో 100 బ్రాడ్‌బ్యాండ్ సంబంధిత ఉద్యోగాలు ఉన్నాయని, వీటికి అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ విద్యా అర్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా తదితర పత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఇతర పూర్తి వివరాల కోసం 08455-271010 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి సూచించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: తెలంగాణ మీడియా అకాడమి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి అమలుపై ఇటీవల ప్రచురితమైన కథనం వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించకుండా, ప్రజల్లో అపోహలు కలిగించే విధంగా ఉండటం విచారకరమని తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో పనిచేస్తోందని తెలిపారు. ప్రత్యేకించి 2023 డిసెంబర్‌లో ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ కార్యకలాపాలను మరింత క్రమబద్ధీకరించి, జర్నలిస్టులకు సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా పలు సంస్కరణలు అమలు చేశామని వెల్లడించారు. గతంలో సంక్షేమ నిధి కమిటీ సమావేశాలు ఎక్కువ విరామంతో నిర్వహించబడగా, ప్రస్తుతం ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటున్నామని, ఈ విధానంతో దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెరగడమే కాకుండా మరణించిన కుటుంబాలకు సహాయానికి సంబంధించిన అర్హత గల ఒక్క దరఖాస్తు కూడా ప్రస్తుతం పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, అంగవైకల్యం లేదా ప్రమాదాలకు గురైన జర్నలిస్టులకు ఆర్థిక తోడ్పాటు, విద్యా సహాయం తదితర సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేస్తూ సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో గవర్నింగ్ కౌన్సిల్ పలు కీలక నిర్ణయాలు తీసుకుందని, గతంలో తీవ్రమైన అనారోగ్యం లేదా శాశ్వత అంగవైకల్యానికి గురైన జర్నలిస్టులకు కేవలం 50 వేల రూపాయల ఆర్థిక సహాయం మాత్రమే అందించబడగా, ప్రస్తుత గవర్నింగ్ కౌన్సిల్ ఆ సహాయాన్ని రెట్టింపు చేసి 1 లక్ష రూపాయలకు పెంచిందని, ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే గణనీయమైన సంఖ్యలో అర్హులైన జర్నలిస్టులు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం పొందారని వివరించారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యా సహాయం, అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టులకు ఆర్థిక తోడ్పాటు, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యవసర సమయంలో ఆర్థిక భరోసా కల్పించడం వంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమాల్లో కూడా ప్రభుత్వం నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం చిన్న బ్యాచ్‌లుగా సుమారు 75 మంది జర్నలిస్టులతో నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే పలు జిల్లాల జర్నలిస్టులకు ఆధునిక మీడియా ధోరణులు, డిజిటల్ జర్నలిజం, ఫ్యాక్ట్ చెకింగ్, కృత్రిమ మేధస్సు వినియోగం, ఎన్నికల నిబంధనలు, మీడియా నైతిక విలువలు వంటి అంశాలపై నిపుణులతో ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఇవే కాకుండా గిరిజన జర్నలిస్టులకు, ఉర్దూ జర్నలిస్టులకు, మహిళా జర్నలిస్టులకు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులకు ప్రత్యేక సదస్సులను, శిక్షణా కార్యక్రమాలను అకాడమి నిర్వహించిందని, ఇటీవలే సర్ పై గోష్టిని కూడా విజయవంతంగా ఏర్పాటు చేసిందని వివరించారు. వాస్తవాలను తెలుసుకోకుండా, అసంపూర్ణ సమాచారంతో ప్రచురితమయ్యే కథనాలు జర్నలిస్టులలో అనవసరమైన అపోహలు, ఆందోళనలు కలిగించే అవకాశం ఉందని, బాధ్యతాయుతమైన మీడియా విలువలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అంశాలపై పూర్తి సమాచారాన్ని తెలుసుకున్న అనంతరం వార్తలను ప్రచురిస్తే దాని విశ్వసనీయత పెరుగుతుందని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రస్తుతం దీనిని మరింత బాధ్యతాయుతంగా, వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి పునరుద్ఘాటించారు.

# ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి: సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026):జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను విజయవంతంగా నిర్వహించి, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి, ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని వివరించడంతో పాటు వారి అభిప్రాయాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం పూర్తయిందని, ఇప్పటివరకు సగటున 55 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే నారాయణఖేడ్‌లో 73 శాతం, ఆందోల్‌లో 65 శాతం, జహీరాబాద్‌లో 61 శాతం, సంగారెడ్డిలో 54 శాతం, పటాన్‌చెరులో 35 శాతం డిజిటైజేషన్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. నిర్ణీత సమయంలోగా జిల్లాలో డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టడంతో పాటు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని, బూత్ స్థాయి ఏజెంట్లను చైతన్యపరిచి బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలకు) సహకరించేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన ఏర్పడిందని, అధికారులు నిబద్ధతతో పనిచేస్తున్నారని పేర్కొంటూ, కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్‌డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# గురుకుల సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యానికి తావు లేదు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డీఎస్సీ భవనంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి తమ పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుండి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించి, వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుపై ఉన్న ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుండి వచ్చిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లో సీట్లు కేటాయించాలని, ఇతర జిల్లాల్లో చదివించడం వల్ల ఎదురవుతున్న రవాణా, ఆర్థిక ఇబ్బందులను మంత్రికి వివరించగా, ఆయన సానుకూలంగా స్పందిస్తూ అర్హులైన విద్యార్థులకు వీలైనంత వరకు అనుకూలమైన జిల్లాల్లో సీట్లు కేటాయించేలా ప్రత్యేక చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం, విద్యార్థుల సంక్షేమమే ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్‌కు మంత్రి సూచించారు. మారుమూల గ్రామాల నుండి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రులు, సంరక్షకులతో అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి స్పష్టమైన సమాచారంతో పాటు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురిచేయరాదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు కేటాయిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం లేదా అలసత్వానికి ఎలాంటి తావు ఉండకూడదని మంత్రి హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలను ప్రతి అధికారి తమ బాధ్యతగా భావించి పనిచేయాలని, ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని, నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉద్ఘాటించారు.



# ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతికి కేంద్రం పూర్తి సహకారం: కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి శ్రీ రామ్‌దాస్ అథవాలే భరోసా ఇచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా బుధవారం టూరిజం ప్లాజాలో కేంద్ర మంత్రిని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల నుండి తక్షణమే 150 కోట్ల రూపాయల విడుదలకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, అలాగే పాఠశాలలు, హాస్టళ్ల అభివృద్ధికి ప్రతిపాదించిన 300 కోట్ల రూపాయల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీపై వచ్చే నెలలో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని మంత్రి అడ్లూరి వెల్లడించారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా చేసుకుని పనిచేస్తోందని, విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 16 సంవత్సరాల తర్వాత రికార్డు స్థాయిలో 212 శాతం పెంచామని కేంద్ర మంత్రికి వివరించారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు గురుకులాలు, హాస్టళ్లలో చదువుకుంటున్నందున, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు పెండింగ్‌లో ఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, కాబట్టి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే హాస్టళ్లు, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సురక్షిత తాగునీరు, ఆధునిక వంటశాలలు, మరుగుదొడ్లు వంటి సదుపాయాల కల్పన కోసం 300 కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి, ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ (జీఎం) హనుమంత్ నాయక్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) మల్లయ్య భట్టు, ఎస్సీ స్టడీ సెంటర్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) జాయింట్ సెక్రెటరీ (అడ్మిన్) సక్రు నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సత్యనారాయణతో పాటు వివిధ సంక్షేమ శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.





# సీతమ్మసాగర్ పర్యావరణ అనుమతులపై కేంద్రంతో నిరంతర సంప్రదింపులు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్) వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయి, సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. రేపు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తున్న నేపథ్యంలో ఈ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ) అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటం వల్ల మార్చి 2023 నుంచి ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని, ఈ న్యాయపరమైన చిక్కులను వీలైనంత త్వరగా పరిష్కరించి అనుమతులు సాధించేందుకు ప్రభుత్వం అన్ని స్థాయిల్లో కృషి చేస్తోందని మంత్రి తుమ్మల వివరించారు. ఈ సందర్భంగా సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్-1, పంప్‌హౌస్-2 మధ్య దోమలవాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై చర్చించగా, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే వర్షాకాలంలో అధిక వరద ప్రవాహాన్ని నియంత్రించి కాలువలకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు పంప్‌హౌస్-1, 2, 3 మధ్య అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటుపై సాంకేతిక పరిశీలనలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని, 2026 ఆగస్టు నాటికి దీనిని పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని మంత్రి తుమ్మల పేర్కొనగా, సొరంగం నిర్మాణ బిల్లుల చెల్లింపులను త్వరగా విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఆయిల్‌పామ్ తోటలు ఎక్కువగా ఉన్నందున, సంప్రదాయ కాలువలకు బదులుగా పైపుల ద్వారా సాగునీటి పంపిణీ (పైప్డ్ ఇరిగేషన్ నెట్‌వర్క్) సాధ్యాసాధ్యాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు నిలిచిపోయిన జూలూరుపాడు సొరంగం పనులను ప్రాధాన్యతతో పునఃప్రారంభించి పాలేరు జలాశయానికి వీలైనంత త్వరగా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఇరువురు మంత్రులు పునరుద్ఘాటించారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముఖాముఖి విజయవంతం

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) అధికారిక నిరంతరాయ షెడ్యూల్ ప్రకారం బుధవారం హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) లో ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, మరియు ఆదిలాబాద్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీ మోతె శోభన్ రెడ్డి, శ్రీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొని, సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల సలహాలను, సూచనలను, ఆనాటి ఉద్యమ ఆధారాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... స్వరాష్ట్ర సాధనలో సరిహద్దు జిల్లాలైన నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. నాడు వివక్షకు వ్యతిరేకంగా అడవి బిడ్డల నుండి మొదలుకొని పట్టణ శ్రేణుల వరకు, విద్యార్థి లోకం, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు రహదారులను స్తంభింపజేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారని, ఆనాటి పోరాట పటిమే నేటి స్వరాష్ట్ర ఆవిర్భావానికి బలమైన పునాది అని ప్యానల్ స్పష్టం చేసింది. ఈ ముఖాముఖి సంప్రదింపుల్లో నాలుగు జిల్లాల ప్రతినిధులు, క్షేత్రస్థాయి యోధులు తమ భవిష్యత్తుకు రక్షణ కల్పించాలని కోరుతూ కమిటీ ముందు పలు ప్రధాన సంక్షేమ డిమాండ్లను ఉంచారు. అందులో ఇల్లు లేని అర్హులైన ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి 250 గజాల నివాస స్థలాన్ని ఉచితంగా కేటాయించి రిజిస్ట్రేషన్ చేయించడం, వృద్ధాప్యంలో ఆత్మగౌరవంతో జీవించడానికి గౌరవప్రదమైన నెలవారీ జీవితకాల పెన్షన్ అందించడం, నాటి పోరాటంలో చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన ఉద్యమకారుల పిల్లలకు విద్యా సంస్థల అడ్మిషన్లలో మరియు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడం, మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక స్వయం ఉపాధి పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వడం, ఉచిత కార్పొరేట్ వైద్య సేవలు పొందేందుకు వీలుగా ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయడం, వారి పిల్లలకు కేజీ నుండి పీజీ (KG to PG) వరకు పూర్తి ఉచిత నాణ్యమైన విద్యను అందించడం, మరియు వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో జీవితకాల ఉచిత ప్రయాణ రవాణా పాస్ సౌకర్యం కల్పించడం వంటి వినతులు ఉన్నాయి. ఈ డిమాండ్లపై కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ... ఈ సంక్షేమ అంశాలు ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని, వారి రక్తం, చెమట చిందించి సాధించుకున్న ఆత్మగౌరవ హక్కు అని పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ (I&PR) ద్వారా జరుగుతున్న పూర్తి స్థాయి డిజిటల్ రికార్డింగ్ సాక్షిగా, ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ఈ ముఖాముఖి సంప్రదింపుల షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని, ఈ ప్రధాన సంక్షేమ అంశాలతో కూడిన సమగ్రమైన, చారిత్రాత్మక నివేదికను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి సమర్పించి త్వరితగతిన న్యాయం జరిగేలా కమిటీ బాధ్యత తీసుకుంటుందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పష్టం చేశారు.

# నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ శాసనసభ సచివాలయం, ఈక్విప్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): తెలంగాణ రాష్ట్ర శాసనసభ సచివాలయం మరియు ఈక్విప్ (EQUIPPP) సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్ మధ్య నియోజకవర్గాల అభివృద్ధి ఎక్స్ఛేంజ్ (CDX) పై బుధవారం శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక చారిత్రాత్మక అవగాహన ఒప్పందం (MOU) కుదిరింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, ఈక్విప్ డైరెక్టర్ శ్రీమతి వింధ్యా ధర్మరాజు, ఫౌండర్ లక్ష్మీ నారాయణ, ఐ ల్యాబ్స్ చైర్మన్ శ్రీని రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ప్రజల సంక్షేమం కోసం ఈక్విప్ సంస్థతో ఒప్పందం జరగడం శుభపరిణామమని, ప్రస్తుత రాజకీయాల్లో చట్టాలు చేసే ఎమ్మెల్యేలు నేడు నియోజకవర్గాల అభివృద్ధికి పూర్తి బాధ్యులుగా మారారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతోనే నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రైవేట్ రంగం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తూ సిడిఎక్స్ (CDX) కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగం, పౌర సమాజం, విద్యా సంస్థలు, దాతలు, ఎన్జీఓలు మరియు సీఎస్ఆర్ నిధులను సమీకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం ద్వారా విప్లవాత్మక ఫలితాలు సాధించవచ్చని నమ్మకం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్న తరుణంలో, ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో స్థానిక శాసనసభ్యుల సహకారంతో నైపుణ్యాభివృద్ధి, విద్య, ఆరోగ్య సంరక్షణ, మహిళా సాధికారత, డిజిటల్ సమ్మిళితం, సుస్థిర జీవనోపాధి, ఆర్థిక పరిపుష్టి వంటి రంగాలలో ఈక్విప్ సంస్థ క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనిచేస్తుందని, దీనికి తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. శాసనసభ వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ నిధుల అవసరం లేకుండా నియోజకవర్గాల వారీగా అభివృద్ధి సాధించడానికి ఈక్విప్ సంస్థ నూతన ఆలోచనతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. క్షేత్రస్థాయి ఇబ్బందులను గుర్తిస్తూనే, స్థానికంగా ఉన్న అవకాశాలను మరియు వనరులను పారిశ్రామిక స్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఆర్థిక స్థిరత్వం పెరుగుతుందని చెప్పారు. నియోజకవర్గాల వారీగా స్పష్టమైన రూట్ మ్యాప్ రూపొందించుకుని పనిచేయడం ద్వారా రాష్ట్రంతో పాటు దేశ౦ కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# ఆషాడ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): తెలంగాణ ఆత్మను, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఆషాడ బోనాల ఉత్సవాలు తెలంగాణకు ప్రత్యేకమైన శక్తి ఆరాధనా పండుగ అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ అన్నారు. గురువారం (జూలై 16) నుండి ప్రారంభం కానున్న ఆషాడ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆమె ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక మహోత్సవమని కొనియాడారు. ఈ ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న సుమారు 3 వేలకు పైగా దేవాలయాలలో అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని, లౌకిక స్ఫూర్తిని చాటుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు జూలై 16న గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ప్రారంభమై, ఆగష్టు 13న హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయంలో అమ్మవారికి బోనాల సమర్పణ అనంతరం ఘటాల నిమజ్జనంతో ముగుస్తాయని వివరించారు. రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ యేడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు 20 కోట్ల రూపాయలు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవార్ల దయతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవార్లను దర్శించుకుని, బోనాలు సమర్పించి క్షేమంగా ఇళ్లకు చేరుకునేలా అన్ని శాఖలు సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేశాయని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.




## పాఠశాలల్లో అగ్నిమాపక భద్రతపై యాజమాన్యాలకు అవగాహన: తెలంగాణ అగ్నిమాపక శాఖ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: విద్యాసంస్థల్లో అగ్నిమాపక భద్రత, విపత్తు సంసిద్ధతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, సివిల్ డిఫెన్స్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పాఠశాల యాజమాన్యాల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేసిక్ ఎలిమెంట్స్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, సివిల్ డిఫెన్స్ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ ప్రారంభించారు. బేసిక్ ఎలిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ నిష్ఠాలా సమక్షంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలకు చెందిన 500 మందికి పైగా పాఠశాల యజమానులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, సీనియర్ అడ్మినిస్ట్రేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ అగ్నిమాపక భద్రత అనేది కేవలం చట్టపరమైన నిబంధన మాత్రమే కాదని, విద్యార్థుల ప్రాణాలను కాపాడాల్సిన ప్రతి పాఠశాల యాజమాన్యం యొక్క నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, అగ్నిమాపక రక్షణ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం, మాక్ డ్రిల్స్ చేపట్టడం, విద్యార్థులు, సిబ్బందిలో భద్రతపై అవగాహన పెంచడం అవసరమని సూచించారు. దేశంలోని పలు పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటనలను ఉదాహరణగా చూపిస్తూ నిర్లక్ష్యం, సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం–1999 నిబంధనలు, పాఠశాల భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరించారు. తనిఖీల సమయంలో గుర్తించే సాధారణ లోపాలు, వాటి నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను సురక్షితంగా తరలించే విధానం, ఫైర్ అలారం వ్యవస్థలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, విద్యుత్ భద్రత, హాస్టళ్లలో అగ్నిమాపక జాగ్రత్తలపై యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. విద్యాసంస్థలతో సమన్వయంతో పనిచేస్తూ అగ్నిప్రమాదాల నివారణ, విపత్తు సంసిద్ధతను పెంపొందించి తెలంగాణలో ప్రతి చిన్నారికి సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలంగాణ అగ్నిమాపక శాఖ వెల్లడించింది.

## తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్ నియామకం



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ప్రతిష్ఠాత్మక తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాష పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించే తెలుగు అకాడమీ బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్‌కు అప్పగించడంపై విద్యావేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య భట్టు రమేష్‌కు ఉన్నత విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధన అనుభవం ఉంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా సేవలందించడంతో పాటు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతిగా, గిరిజన అధ్యయన శాఖ అధిపతిగా, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. గిరిజన సామాజిక నేపథ్యం నుంచి వచ్చిన ఆయన జానపద, గిరిజన సంస్కృతుల పరిరక్షణకు విశేష కృషి చేశారు. పలు మేజర్, మైనర్ పరిశోధన ప్రాజెక్టులను చేపట్టి పూర్తి చేసిన ఆయన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. జానపద, గిరిజన విజ్ఞానానికి సంబంధించి 30కి పైగా పరిశోధనా గ్రంథాలకు సంపాదకత్వం వహించడంతో పాటు ఏడు పుస్తకాలను స్వయంగా రచించారు. గిరిజన బాలల కోసం 'బంజారా భారతి', 'బంజారా గణితం' వంటి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన పర్యవేక్షణలో పలువురు పరిశోధకులు ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. విద్యారంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొన్న ఆచార్య భట్టు రమేష్, గతంలో శాంతి చర్చల మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర స్థాయి మద్యపాన నిషేధ సలహా కమిటీ సభ్యుడిగా, గిరిజన భూ రక్షణ చట్టాల పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా సేవలందించారు. వరంగల్ జిల్లాలో గుడుంబా ప్రభావిత గ్రామాల్లో గిరిజన మహిళలు, యువతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన విద్యా సేవలను గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం నుంచి 2014లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, గిరిజన సాహిత్యం, జానపద కళల రంగంలో చేసిన కృషికి గాను 2017లో డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా నియామకం అనంతరం ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషా వికాసం, పాఠ్యపుస్తకాల నాణ్యమైన ప్రచురణ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నేడు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన


**Press Note**
**District Election Officer (Nagarkurnool)**

***Clarification Regarding Voter Registration Rumors in Achampet AC***

It has come to notice of undersigned that false information is circulating on social media regarding the voter status of the Honorable Chief Minister, Sri Anumula Revanth Reddy, in Nagarkurnool district.

As the District Election Officer (DEO) for Nagarkurnool, below clarification is issued concerning district jurisdiction:

- **There is no voter registration for Sri Anumula Revanth Reddy in Achampet Assembly Constituency or anywhere within Nagarkurnool district as on today.**
- There is absolutely no case of double voting or dual enrolment in Nagarkurnool district in this particular case.
- As the voter enrolment is not there, the question of Enumeration Form printing and distribution in the process of Special Intensive Revision does not arise.
- Citizens are requested not to believe or spread baseless rumours.

**Collector and District Election Officer**
**Nagarkurnool District**
**(14th July 2026)**

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేడు (15-07-2026) రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న సీఎం, అనంతరం ఫ్యూచర్ సిటీలో మధ్యాహ్నం 12.15 గంటలకు నిర్వహించే అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలోని అమర రాజా గిగా కారిడార్‌లో సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు




## ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే అందజేయండి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్‌ఓలు) అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ పిలుపునిచ్చారు. ఓటర్లు తమ విలువైన ఓటు హక్కును కాపాడుకునేందుకు ఈ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన సూచించారు. బీఎల్‌ఓలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసి, పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి అందించాలని తెలిపారు. ఫారంలో ఓటరు సంతకం, తేదీతో పాటు బీఎల్‌ఓ సంతకం కూడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకదానిని బీఎల్‌ఓలకు తిరిగి ఇవ్వాలని, మరొకదానిని ఓటర్లు భద్రపరుచుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌ఓలకు సమర్పించినప్పుడే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటరు వివరాలు ఉన్నట్లయితే వాటిని తప్పనిసరిగా నమోదు చేయాలని, లేని పక్షంలో ప్రస్తుత వివరాలతో ఫారం పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది (49.28 శాతం) ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించినట్లు సీఈఓ వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ 2026 జూన్ 25న ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు ఆలస్యం చేయకుండా తక్షణమే పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌ఓలకు అందజేయాలని ఆయన కోరారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది: 49.28 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | 15 జూలై 2026: తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. 2026 జూలై 14 సాయంత్రం 6 గంటల నాటికి రాష్ట్రంలోని మొత్తం 3,38,26,448 మంది ఓటర్లకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 3,38,21,554 ఎన్యూమరేషన్ ఫారాలు (99.99 శాతం) పంపిణీ చేయగా, ఇప్పటివరకు 1,66,70,610 ఫారాలు (49.28 శాతం) డిజిటైజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

జిల్లాల వారీగా పరిశీలిస్తే సూర్యాపేట జిల్లాలో 10,08,252 మంది ఓటర్లకు గాను 10,08,252 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 4,59,942 ఫారాలు (57.61 శాతం) డిజిటైజ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో 14,57,436 మంది ఓటర్లకు గాను 14,57,412 ఫారాలు పంపిణీ చేసి, 7,25,523 ఫారాలు (49.78 శాతం) డిజిటైజ్ అయ్యాయి. అత్యధిక డిజిటైజేషన్ శాతం సాధించిన జిల్లాల్లో యాదాద్రి భువనగిరి 79.86 శాతం, సిద్దిపేట 72.11 శాతం, కుమురం భీం ఆసిఫాబాద్ 70.79 శాతం, నిజామాబాద్ 70.22 శాతం, రాజన్న సిరిసిల్ల 69.86 శాతం జిల్లాలు ముందంజలో ఉన్నాయి.

ఇక హైదరాబాద్ జిల్లాలో మొత్తం 47,36,669 మంది ఓటర్లకు గాను 47,36,660 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 10,52,490 ఫారాలు (22.22 శాతం) డిజిటైజ్ అయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో 36,99,743 మంది ఓటర్లకు గాను 12,36,659 ఫారాలు (33.43 శాతం) డిజిటైజ్ చేశారు.

ఎన్నికల అధికారులు ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి బూత్ లెవల్ ఆఫీసర్లకు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావడం ద్వారా ఓటరు జాబితా మరింత ఖచ్చితంగా రూపొందుతుందని అధికారులు తెలిపారు.



## TJWA సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా CH. బస్వరాజు నియామకం

సంగారెడ్డి, జూలై 15: తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (TJWA) రిజిస్ట్రేషన్ నెం. 288/2026 సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శ్రీ CH. బస్వరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా TJWA జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శెట్టి వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా TJWA సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విస్తరించడం, జర్నలిస్టుల సమస్యలను గుర్తించి రాష్ట్ర, జాతీయ కమిటీ దృష్టికి తీసుకెళ్లడం, జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు ఇతర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయడం, మండల, నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయడం, జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయడం జిల్లా అధ్యక్షుని ప్రధాన బాధ్యతలని తెలిపారు. సంఘ నియమావళిని పాటిస్తూ సభ్యుల మధ్య ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించేలా సమర్థవంతమైన నాయకత్వం అందించాలని సూచించారు. శ్రీ CH. బస్వరాజు నాయకత్వంలో సంగారెడ్డి జిల్లాలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ మరింత బలోపేతమై జర్నలిస్టుల సంక్షేమానికి విశేష సేవలు అందిస్తుందని TJWA జాతీయ కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.



## గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, జూలై 16: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన పేద కుటుంబానికి పక్కా గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. కొల్చారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ పీడీ మాణిక్యం, తహసీల్దార్ శ్రీనివాస చారి, ఎంపీడీవో రహీం మున్నీసా బేగం, సర్పంచ్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రెండో విడతలో ప్రాధాన్యత ఇచ్చే గుడిసెల ధ్రువీకరణ, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లలో సంవత్సరం కావస్తున్నా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొదటి విడతలో 9 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 83 శాతం పురోగతి సాధించామని, 1700 ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరిగాయని తెలిపారు. 2400 ఇళ్లు స్లాబ్ పూర్తి చేసుకుని ఫెన్సింగ్ దశలో ఉన్నాయని, 650 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో, 1400 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉన్నాయని, మిగతా ఇళ్లు పునాది దశలో ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటివరకు 1600 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదని, వారికి అవగాహన కల్పించి త్వరితగతిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా జిల్లాలో గుడిసెల సర్వే పూర్తయిందని, గుడిసెల్లో నివసించే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు ముందుకు సాగాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్, జూలై 16: మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధిలో భాగంగా రూ.2 కోట్ల 93 లక్షల నిధులతో పలు వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 31, 30, 23, 22, 20, 16, 17, 18, 19, 21, 28 వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అభివృద్ధి కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించడం తన బాధ్యత అని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని రంగాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గతంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మెదక్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు తీసుకొస్తున్నామని చెప్పారు. అభివృద్ధి కేవలం హామీలకే పరిమితం కాకుండా పనుల రూపంలో కనిపించాలనే ఉద్దేశంతో ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. ఏ వార్డు వెనుకబడకుండా అన్ని ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడతామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి మెదక్‌ను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలబెడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

మెదక్, జూలై 16: ప్రతి కేసులో వేగవంతంగా, నాణ్యమైన దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసులను నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను శ్రద్ధగా విని చట్టబద్ధమైన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీసు అధికారిని నియమించి రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆర్థిక నేరాల నివారణలో భాగంగా వాహన తనిఖీలు, నాకాబందీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, బ్లూ కోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలాన్ పరికరాల ద్వారా అనుమానితుల వివరాలు సేకరించాలని సూచించారు. గ్రామాల్లోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, దుకాణాలు, ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు వంటి కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, సీఐలు రేణుక, రాజశేఖర్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, మహేష్, జార్జ్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



## మెదక్ జిల్లాలో 55 శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తి: కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, జూలై 16: మెదక్ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 55 శాతం నమోదు పూర్తయిందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మంగళవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియకు ఈ నెల 24వ తేదీ చివరి గడువు ఉందని, గడువులోగా నూరు శాతం నమోదు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో 4.55 లక్షల మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 55 శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తయిందని తెలిపారు. ఎస్ఐఆర్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు వాటిని సక్రమంగా పూర్తి చేయించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన చోట రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వాట్సాప్ గ్రూపుల ద్వారా వీడియోలు, సందేశాలు పంపించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. శని, ఆదివారాల్లో అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక ఎస్ఐఆర్ శిబిరాలు నిర్వహించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ నవీన్, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం చేసిన వారమవుతాం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి జులై, 16

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కోర్టు–పోలీసు సమన్వయ సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం చేసిన వారమవుతామని అన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో పాటు కోర్టు–పోలీసు శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి సూచనలు చేశారు. కోర్టు సమన్లు, వారెంట్లు, చార్జిషీట్లు, కేసు పత్రాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా విచారణ వేగవంతమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందించడమే మెదక్ జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు. పోలీసు శాఖ, న్యాయవ్యవస్థ సమన్వయంతో ఈ ఏడాది జిల్లాలో 20 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయని, వాటిలో 12 కేసుల్లో జీవిత ఖైదు, 5 కేసుల్లో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షలు, మరో 3 కేసుల్లో ఏడు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ జైలు శిక్షలు విధించబడ్డాయని వివరించారు. నాణ్యమైన దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆధారాల వినియోగం, సమయానికి చార్జిషీట్లు దాఖలు చేయడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. సమావేశం అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, సీఐలు, ఎస్సైలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత వాసిరెడ్డి వెంకటేశ్వర్లును పరామర్శించిన మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మం, జూలై 16: ఏన్కూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాసిరెడ్డి వెంకటేశ్వర్లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆయనను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి వెంకటేశ్వర్ల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించిన నామ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.



# ఎస్ఐఆర్ కార్యక్రమంలో బాధ్యతగా పాల్గొనాలి: మాజీ సర్పంచ్ గంప చంద్రశేఖర్

రాయికోడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): రాయికోడ్ మండలంలోని కర్చల్ గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (సమగ్ర ఓటరు సర్వే) కార్యక్రమంలో కర్చల్ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గంప చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ, ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి చేపట్టే సమగ్ర ఓటరు ప్రక్షాళన కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిజమైన ఓటర్ల పేర్లు మాత్రమే జాబితాలో ఉండేలా అధికారులు, రాజకీయ బీఎల్ఏలు, పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేయాలని, డబుల్ ఓట్లు తొలగించి వలస వెళ్లిన వారి ఓట్లు ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా అర్హత పొందిన యువత తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ బీఎల్వో, సంబంధిత అధికారులు లేదా రాజకీయ బీఎల్ఏలు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన బీఎల్ఏలు, పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు జారత్ ఖాన్, పీఏసీఎస్ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, గంప లింగనాథ్, బి. రవి, జంగం సంగన్న స్వామి, బెస్తా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజలకు అందుబాటులో మాజీ ఎంపీటీసీ గాజుల బాబుకుమార్: ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో భరోసా



రాయికోడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): రాయికోడ్ మండలంలోని కర్చల్ గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నమోదు ప్రక్రియలో మాజీ ఎంపీటీసీ గాజుల బాబుకుమార్ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న అమూల్యమైన హక్కు అని, ఆ హక్కును పరిరక్షించుకోవాలంటే అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సందిగ్ధతకు గురవుతున్న ప్రజలకు సరైన మార్గదర్శకత్వం అందిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, ఫారాలు నింపడంలో పూర్తి సహాయం చేసి, సంబంధిత అధికారులకు అందజేసే వరకు బాధ్యతగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. "మీ ఓటు – మీ హక్కు, మీ భవిష్యత్తు" అనే సందేశంతో ప్రతి అర్హుడూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఎస్ఐఆర్ ఫారాన్ని పూర్తి చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని మాజీ ఎంపీటీసీ గాజుల బాబుకుమార్ గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.



# వర్షం కోసం ఆకాశం వైపు రైతన్నల ఎదురుచూపులు

పుల్కల్, సందేశం టైమ్స్ ప్రతినిధి మహేష్ బాబు (16-07-2026): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలో రుతుపవనాల రాకతో రైతులు ఉత్సాహంగా పలు రకాల పంటలు సాగు చేసినప్పటికీ, ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సాగు చేసిన పంటలకు సరిపడా నీరు లేక ఇప్పటికే మొలకెత్తిన పత్తి మొక్కలు, ఇతర పంటలు వాడిపోతుండటంతో రైతన్నలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి రావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆకాశం వైపు దీనంగా చూడడమే కాకుండా, తమ గ్రామాల్లోని దేవాలయాలలో ముక్కోటి దేవతలకు ప్రత్యేక పూజలు మరియు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. వర్ష దేవుడైన వరుణుడు ఇప్పటికైనా కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, తద్వారా తమ పంటలను, పెట్టుబడులను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు భగవంతుడిని వేడుకుంటున్నారు.



# భారతీయ కళలు, సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన

అల్లాదుర్గం, సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్ (16-07-2026): అల్లాదుర్గం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలో భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నృత్య కళాకారిణి లక్ష్మి రఘునాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారతీయ సాంప్రదాయ కళలు, నృత్యాలు మరియు గొప్ప సంస్కృతిని ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకోవడంతో పాటు వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. మన దేశానికి చెందిన కూచిపూడి, భరతనాట్యం, కథాకళి వంటి సాంప్రదాయ నృత్యరూపాల విశిష్టతను మరియు వాటి వెనుక ఉన్న చారిత్రక ప్రాధాన్యతను విద్యార్థులకు కూలంకషంగా వివరించిన ఆమె, భావితరాలకు భారతీయ అద్భుత సంస్కృతిని సగర్వంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే సాంప్రదాయ కళారూపాల పట్ల ప్రత్యేక ఆసక్తి పెంపొందించుకోవాలని, మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో యువత చురుగ్గా భాగస్వాములు కావాలని లక్ష్మి రఘునాథ్ సూచించారు.

# పటాన్ చెర్వు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్






మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): వార్షిక తనిఖీలలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బుధవారం పటాన్ చెర్వు సబ్-డివిజనల్ పోలీసు అధికారి (డీఎస్పీ) కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ తో కలిసి కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కను నాటారు. అనంతరం దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులను పరిశీలిస్తూ వివిధ విభాగాల పనితీరును సమీక్షించిన ఎస్పీ, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచార, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డీఎస్పీ కి సూచించారు. పటాన్ చెర్వు సబ్ డివిజన్ హైదరాబాద్ పరివాహక ప్రాంతం కావడం వల్ల ఉపాధి కూలీలు, ఉద్యోగుల రాకపోకల కారణంగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందని, పరిశ్రమలు ఎక్కువగా ఉండటం వల్ల వలస కార్మికుల సంఖ్య పెరిగి ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల అధిగమించడానికి ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి పగలు, రాత్రి బీట్ నిఘా పెంచేలా ఎస్ హెచ్ ఓ లకు దిశానిర్దేశం చేయాలన్నారు. నేరాల అదుపునకు సబ్ డివిజన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, అనుమానిత వ్యక్తులు, వాహనాలను అదుపులోకి తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ గ్రామాలలో సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరచాలని, నేరాల నివారణలో మరియు ఛేదనలో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ఆయా గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ, పెండింగ్ కేసుల పరిష్కారానికి ఎస్‌హెచ్‌ఓలకు తగిన సూచనలు చేయాలని, తనిఖీలకు సంబంధించిన విజిటింగ్ కాపీలను జిల్లా పోలీసు కార్యాలయానికి సకాలంలో పంపించడంతో పాటు ప్రతి రికార్డు సీసీటీఎన్ఎస్‌లో నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. డీఎస్పీ కార్యాలయ సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ తనిఖీలలో పటాన్ చెర్వు డీఎస్పీ ప్రభాకర్ తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బి.డి.ల్ భానూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): వార్షిక తనిఖీలలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బుధవారం బి.డి.ల్ భానూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా, అనంతరం పటాన్ చెర్వు డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో ఆయన మొక్కను నాటారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల శుభ్రతను, సిబ్బంది బ్యారక్స్‌ను, స్టేషన్ రికార్డుల నిర్వహణను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేస్తూ, వాటిని సర్వీస్ కాలమంతా జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్ మరియు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు అండగా నిలవాలని, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు సైబర్ నేరాల నియంత్రణపై పాఠశాలలు, కళాశాలల్లో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు భానూర్ సమీపంలో ఉన్నందున ఐటీ ఉద్యోగుల రాకపోకలతో పెరిగే ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచాలని, పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వలస కార్మికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నేర ప్రభావిత ప్రాంతాలను (క్రైమ్ ప్రోన్ ఏరియాలు) బ్లాక్ స్పాట్లుగా గుర్తించి నిఘా పెంచాలని సూచించారు. నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, వారు స్వచ్ఛందంగా కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చైతన్యపరచాలన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని కోరారు. స్టేషన్ రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ తనిఖీలలో పటాన్ చెర్వు డీఎస్పీ ప్రభాకర్, బి.డి.ల్ భానూర్ ఎస్.హెచ్.ఓ విజయ్ కృష్ణ, ఎస్ఐ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా గిన్నిస్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం

కోదాడ, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 26న నిర్వహించిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారీ కరాటే కార్యక్రమంలో 1212 మంది కరాటే విద్యార్థులు ఏకకాలంలో 30 నిమిషాల పాటు నిరవధికంగా కటాస్ మరియు బేసిక్ కరాటే టెక్నిక్స్ ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌తో పాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించి దేశవ్యాప్తంగా కరాటే రంగానికి విశేష గుర్తింపును తీసుకువచ్చారు. ఈ చారిత్రాత్మక ప్రపంచ రికార్డు ఘనత సాధించిన కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్‌తో పాటు ఆయన శిక్షణలోని విద్యార్థులకు కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానుల సమక్షంలో ఘనంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను అందజేసి, శాలువాలు కప్పి వైభవంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సీఐ శంకర్ నాయక్, ఎస్ఐలు కుసుమ ఉపేందర్ రెడ్డి, జి. అజయ్ కుమార్, మల్సూర్ హాజరై విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో రికార్డు సాధించడం ప్రతి ఒక్కరికీ దక్కని అరుదైన గౌరవమని, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని పేర్కొంటూ, కోదాడ పట్టణం నుండి ప్రపంచ రికార్డు విజేతలు రావడం గర్వకారణమని కొనియాడారు. ఈ వేడుకలో ప్రతిష్ఠాత్మక రికార్డులు సాధించిన కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్, విద్యార్థులు పొక్కుల ప్రణీత్, పొక్కుల రక్షిత్, శీలం వరుణ్, కంకిపాటి ఉదితి, తిరగమల్ల వేదశ్రీ నిత్య, మోకా అక్షయ, మోకా అక్షిత, వేముల కరుణ్ కుమార్‌లను పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి ఘనంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. తమ పిల్లలు ప్రపంచ స్థాయి రికార్డులు సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి అరుదైన అవకాశాన్ని కల్పించి వారిని ప్రపంచ వేదికపై నిలబెట్టిన కరాటే మాస్టర్ క్రాంతికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ విజేతలు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## మాజీ ఎమ్మెల్యే కాంతి కిరణ్‌ను కలిసి సమస్యలు వివరించిన మత్స్యకారులు

అందోల్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన మత్స్యకార సంఘాల ప్రతినిధులు బుధవారం మాజీ ఎమ్మెల్యే శ్రీ కాంతి కిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా చెరువుల్లో చేపల పెంపకం, చేప పిల్లల పంపిణీ, మత్స్యకార సహకార సంఘాల అభివృద్ధి మరియు తమ జీవనోపాధికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారుల సమస్యలను ఓపికగా విన్న మాజీ ఎమ్మెల్యే కాంతి కిరణ్ సానుకూలంగా స్పందిస్తూ, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మేడికుందా గ్రామంలో ఘనంగా ఎస్ఐఆర్ కార్యక్రమం

వట్‌పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): అందోల్ నియోజకవర్గం వట్‌పల్లి మండలంలోని మేడికుందా గ్రామంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజనాల విశ్వాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు నమోదు మరియు జాబితా సవరణ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ప్రతాప్ రమేష్ జోషి, వట్‌పల్లి సర్పంచ్ రవీందర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు వినయ్ గౌడ్, ఆత్మ కమిటీ ఛైర్మన్ కచూరి రావు, అశోక్ గౌడ్, నారాయణ గౌడ్, మాజీ సర్పంచ్ శివ చరణ్, గ్రామ అధ్యక్షులు దిగంబర్, ఇతర గ్రామ నాయకులు, సీనియర్ మరియు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాకే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు నిర్వహించాలి: గిద్దె రాజేష్ డిమాండ్

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు ముందు వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఆ తర్వాతే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు నిర్వహించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినా అసెంబ్లీలో వికలాంగుల समस्यालపై కనీస స్థాయిలో కూడా సమగ్ర చర్చ జరగకపోవడం బాధాకరమన్నారు. సకలాంగుల రాజకీయ ప్రజాప్రతినిధులు వికలాంగుల సమస్యలను చట్టసభల్లో సమర్థంగా ప్రస్తావించకపోవడం వల్లే వికలాంగుల హక్కులు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అనేక కీలక అంశాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, అందువల్ల వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించి వారి ప్రతినిధులకు చట్టసభల్లో అవకాశం కల్పించడం అత్యవసరమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికలాంగుల సామాజిక భద్రతా పెన్షన్‌ను వెంటనే 6,000 రూపాయలకు పెంచాలని, తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో 100 శాతం రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖను महिला–శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయాలని, వికలాంగుల హక్కుల చట్టం–2016ను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నూతన పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఒక మహిళా వికలాంగురాలికి, ఒక పురుష వికలాంగుడికి కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని, రాష్ట్ర మంత్రివర్గంలో వికలాంగులకు ప్రాతినిధ్యం ఇచ్చి వికలాంగుల సంక్షేమ శాఖకు వికలాంగుడినే మంత్రిగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించి, అసెంబ్లీ ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసి రాజ్యాధికారంలో వికలాంగుల వాటాను ఖరారు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే లక్షలాది మంది వికలాంగులతో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌ను ముట్టడిస్తామని గిద్దె రాజేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు, జిల్లా అధ్యక్షులు గోగుల శేఖర్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు పేర్ల సోమయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కొండ సైదులు యాదవ్, మున్న మధు యాదవ్, కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, గార్లపాటి వెంకటరెడ్డి, గుండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు




## సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి: ములకలపల్లి రాములు

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) కోదాడ నియోజకవర్గ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు పిలుపునిచ్చారు. స్థానిక కోదాడ పట్టణ సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 22, 23 తేదీల్లో కోదాడలో రెండు రోజుల పాటు పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఈ తరగతులకు సుమారు 1000 మంది పార్టీ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ క్లాసులకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మరియు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి తదితర ప్రముఖ నాయకులు హాజరవుతారని వెల్లడించారు. నేడు దేశంలో, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి సిపిఎం పార్టీ నిరంతరం అనేక ఉద్యమాలు నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు కోటగిరి వెంకట్ నారాయణ, జుట్టు కొండ బసవయ్య, సిపిఎం కోదాడ పట్టణ కార్యదర్శి ఎం. ముత్యాలు, కోదాడ మండల కార్యదర్శి అల్సగాని బ్రహ్మయ్య, చిలుకూరు మండల కార్యదర్శి నాగటి రాములు, టౌన్ కమిటీ సభ్యురాలు కుక్కడప్పు నలిని, జి. మరియన్న తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో క్రీడా స్ఫూర్తి ప్రతిబింబించేలా క్రీడా పోటీల నిర్వహణ: అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): జిల్లాలో క్రీడా స్ఫూర్తి ప్రతిబింబించేలా సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయుల సమన్వయం చాలా అవసరమని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అధ్యక్షతన జరిగిన జిల్లాలోని పీడీలు, పీఈటీల సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, ఏఎంఓ సుదర్శన్ మూర్తిలతో కలిసి అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఆగస్టు 25వ తేదీలోపు మండల స్థాయి క్రీడా పోటీలను పూర్తి చేయాలని, అనంతరం సెప్టెంబర్ మొదటి వారం నుండి జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. పోటీల నిర్వహణలో నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, రాష్ట్రస్థాయికి ఎంపికైన ఎస్ జీ ఎఫ్ (SGF) క్రీడాకారులకు డ్రెస్సులు అందించే విషయాన్ని జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ఎస్ జీ ఎఫ్ వెబ్సైట్ పోర్టల్ ను ఆవిష్కరించారు. ఈ ఆన్లైన్ వెబ్ పోర్టల్ ద్వారా క్రీడాకారులకు సంబంధించిన కీలక సమాచారంతో పాటు గతంలో మెదక్ జిల్లా నుండి ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల వివరాలు, జిల్లా మరియు రాష్ట్రస్థాయి పతకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమవుతుందని, ఇది క్రీడాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (SGF) కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. నాగరాజు మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలలో 4,150 మంది బాలబాలికలు వివిధ క్రీడాంశాలలో పాల్గొనగా, వారిలో 192 మంది రాష్ట్రస్థాయికి, 16 మంది జాతీయస్థాయికి ఎంపికై జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ సుదర్శనమూర్తి, పీటీల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ ఎస్. నాగరాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మధు, శ్రీధర్ రెడ్డి, మాధవరెడ్డి, శ్యామ్, రూపేందర్ మరియు సంబంధిత పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



## కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి: సీపీఎం డిమాండ్

అందోల్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని వట్టిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ)లో నెలకొన్న వివిధ మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జోగిపేట ఆర్డీవోను కలిసి ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, సుమారు 500 మంది బాలికలు ఒకే క్యాంపస్‌లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నప్పటికీ వారికి తగిన సంఖ్యలో మరుగుదొడ్లు లేకపోవడం, తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాల కల్పన కోసం విద్యార్థినులు తమ సమస్యలను హాస్టల్ ఎస్ఓ దృష్టికి తీసుకెళ్లగా, సదరు అధికారి వారి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి విద్యార్థులపై దుర్భాషలాడుతూ, తీవ్ర బెదిరింపులకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఇలాంటి వ్యవహారాలు సాగడం సరికాదని, విద్యార్థినుల పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన సంబంధిత ఎస్ఓపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు.



## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (Special Intensive Revision - SIR) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 67.08 శాతం సర్ (SIR) నమోదు అయిందని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, అలాగే అనర్హుల పేర్లను నిబంధనల మేరకు తొలగించే ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్, దరఖాస్తుల పరిశీలన వంటి ప్రతి దశను అధికారులు అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (BLOలు) తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రజల నుండి అందిన దరఖాస్తులను ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను అధికారులు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.



## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి నీలం మధు ముదిరాజ్

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): ఆపత్కాలంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఒక సంజీవనిలా మారిందని, నిరుపేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో భరోసానిస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన అమీన్ పూర్ డివిజన్‌కు చెందిన అనసుజకు 60,000 రూపాయలు, గుమ్మడిదలకు చెందిన సీహెచ్ శ్రీనివాస్‌కు 47,500 రూపాయలు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామానికి చెందిన సంగన్నగారి మహేష్‌కు 60,000 రూపాయల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎన్ ఎం ఆర్ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, ఆర్థిక స్థోమత లేక కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని కొనియాడారు. సమయానికి వైద్యం అందక, అప్పుల పాలవుతున్న ఎన్నో కుటుంబాలను ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆదుకుంటోందని, నిరుపేదలు అనారోగ్యం బారిన పడినప్పుడు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియను విజయవంతం చేయాలి

ఖమ్మం, సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ (16-07-2026): బోనకల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. బోనకల్‌లోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు)తో సమావేశమై కార్యక్రమం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, అర్హుల పేర్లు నమోదు చేయడం, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించడం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉండటం వల్ల ఎన్నికల ప్రక్రియ మరింత విశ్వసనీయంగా సాగుతుందని పేర్కొంటూ, కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్ఓలు, బీఎల్ఏలు ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని, ప్రజలు కూడా ఈ ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమంలో అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బోనకల్ మండల మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని, అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఓటర్ల జాబితాను మరింత పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పారా ప్రసాద్, నాగేశ్వరావు, బంధం నాగేశ్వరావు, ఇటుకల శ్రీను, వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్యుమరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బీఎల్ఓకు అందించాలి: సర్పంచ్ జైపాల్ నాయక్

అందోల్, సందేశం టైమ్స్ ప్రతినిధి (16-07-2026): బొమ్మరెడ్డిగూడెం గ్రామంలోని ప్రతి ఓటరు తమకు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా, ఎలాంటి తప్పులు లేకుండా నింపి సంబంధిత బీఎల్ఓకు తప్పనిసరిగా అందజేయాలని గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన, ఎన్యుమరేషన్ ఫారాలపై ఫోటోలను అతికించి, వ్యక్తిగత వివరాలను సరిచూసుకుని సకాలంలో గ్రామ అంగన్‌వాడీ టీచర్, బీఎల్ఓ గీతకు అందజేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉండటంతో పాటు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి కుటుంబం ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అంగన్‌వాడీ టీచర్, బీఎల్ఓ గీత, రెండో వార్డు సభ్యుడు సుభాష్, బుచ్చయ్య, రమేష్, శ్రీను, కుమ్మరి రాజు, కుమార్ సంతోష్, అభిలాష్, శివ, రాజు, సుశీల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ లోనే ఇసుక బుకింగ్ ప్రక్రియ జరగాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ (16-07-2026):** జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా ఆన్లైన్ లోనే బుకింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇసుక సరఫరాపై వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇసుక సరఫరా ప్రక్రియ ఆన్లైన్ లో పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఎంత పరిమాణంలో ఇసుకను ఎక్కడెక్కడి నుండి పొందిందనే విషయాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఇసుకను టీజీఎండీసీ, స్యాండ్ బజార్ లేదా స్థానికంగా సమకూర్చుకోవాలని, అయితే ఈ బుకింగ్ అంతా కచ్చితంగా ఆన్లైన్ లోనే చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్ లలో 1000 క్యూబిక్ మీటర్ల మేర ఇసుకను అందుబాటులో ఉంచామని, ఇసుక రీచ్ ల వారీగా వచ్చిన ఆదాయం వివరాలను వెంటనే సమర్పించాలని పేర్కొన్నారు. ఇట్టి ఆదాయాన్ని నిబంధనల మేరకు ఆయా గ్రామ పంచాయతీ తదితరాలకు పంపిణీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే నివేదిక అందించాలని, అట్టి సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖలచే తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అలసత్వం వహించకుండా, నిర్ణీత గడువులోపు ప్రభుత్వ అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీవో టిజిఎండిసి జి. శంకర్, మైన్స్ ఏజి ఏ. రమేష్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, పీఆర్ ఇఇ లు మహేష్ బాబు, రామకోటి, డిఇ లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు: సందేశం టైమ్స్ (Sandesham Times)- రిజిస్ట్రేషన్ నం: TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, (పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ- 508206, ప్రచురణకర్త /publisher: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: నండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522006.